# పోస్ట్‌మాన్

పోస్ట్‌మన్ సీతయ్య దినచర్య ఒకే మాదిరిగా ఉంటుంది రోజూ, మార్పు లేకుండా.

ఉదయమే పోస్ట్‌ఆఫీస్‌లో మిగతా పోస్ట్‌మన్‌తోపాటు, పొడుగాటి బల్ల ముందు కూర్చుంటాడు. తన జోన్‌లో ఇవ్వవలసిన ఉత్తరాలన్నీ తీసుకుని, తొమ్మిదిన్నరకి పోస్ట్‌ఆఫీస్‌లోంచి బయటికి వస్తాడు.

అప్పటికే చాలామంది బయట ఎదురుచూస్తుంటారు సీతయ్య కోసం. సీతయ్య బయటికి రాగానే చుట్టూ మూగుతారు. పన్నెండు సంవత్సరాల నుంచి పోస్ట్‌మన్‌గా పని చేస్తున్నాడు సీతయ్య. అందరి మొహాలు, పేర్లు గుర్తే సీతయ్యకి, అడ్రసులతో సహా.

వాళ్ళు అడక్కుండానే ఎవరి ఉత్తరాలు వాళ్ళకి ఇచ్చేస్తాడు. చాలామంది రిటైరయిన ముసలివాళ్ళు, ఇంటర్వ్యూలకి వెళ్ళిన నిరుద్యోగులే పోస్ట్‌ఆఫీస్‌కు ఉత్తరాలకోసం వచ్చేది.

> చిన్నదో, పెద్దదో-ఏమైనా తాను చేసే పనిలో ఒక విధమైన సంతృప్తిని పొందడం మనిషిలోని గొప్పతనం. ఆ సంతృప్తే లేకపోతే ముందుకు నడవలేడు; చూడలేడు. జీవితంలో మరో మెట్టు పైకి పోవాలని ఎదురు చూడడం సహజమే. తీరా ఆశలు ఫలించి, ఫలితం చేరువయిననాడు గతంలోని అనుభూతులు పట్టి బంధించితే ఆశ్చర్యం లేదు.

నెమ్మదిగా పోస్ట్‌ఆఫీస్‌లో నుంచి బయటికి వస్తాడు. దాదాపు అరమైలు పొడవున్న ఆ రోడ్డు మొదట్లో ఓ ఇంటి అరుగుమీద కూర్చుని, తీరికగా ఉత్తరాలు సర్దుకుంటాడు. ఉత్తరాలన్నీ తను వెళ్ళేదారిలో ఉన్న ఇళ్ళు ఏ విధంగా ఉన్నాయో, ఆ క్రమంలో సర్దేస్తాడు చకచకా, ఒకదాని తరవాత మరొకటి. ఉత్తరాలు కట్టలో ఎక్కడికి వెళ్ళాలో అక్కడికి యాంత్రికంగా వెళ్ళిపోతాయి, పన్నెండేళ్ళ అనుభవం వల్ల.

ఉత్తరాలన్నీ ఒక కట్టగా తయారవగానే, నల్లగా మాసిపోయి మురికితో ఉన్న ఓ ఏడు సంవత్సరాల వయస్సు గల తాడుతో ఉత్తరాల కట్టని గట్టిగా కడతాడు, నాలుగు చుట్లు తిప్పి, ఉత్తరాలు జారిపోకుండా.

ఎప్పటిలాగానే, కట్ట పూర్తవగానే, సీతయ్య మొహానికి పట్టిన చమటను తుడుచుకుని బయలుదేరాడు, ఉత్తరాల బట్వాడాకి.

ఖాకీ పేంట్, ఖాకీషర్ట్ ఆ ఎండలో వేసుకుని నడవడానికి ఇబ్బందిగానే ఉంది. కాని సీతయ్యకు తప్పదు. సైకిలుకూడా లేదు. నడిచే వెళతాడు సీతయ్య.

"ఉత్తరం ఉందా?"

మధ్యలో ఎదురుపడి అడుగుతున్నారు కొందరు. ఉత్తరాల కట్ట విప్పి చూడకుండానే, ఉన్నదీ లేనిదీ చెపుతున్నాడు సీతయ్య. ఉంటే ఇచ్చేస్తున్నాడు. ఉత్తరాలుకట్టలో సర్దేటప్పుడే గుర్తు పెట్టుకుంటాడు సీతయ్య, ఎవరికి ఉత్తరాలు వచ్చాయో, ఎవరికి రాలేదో. పన్నెండేళ్ళ అలవాటు వల్ల సాధ్యమయింది ఈ జ్ఞాపకశక్తి, సీతయ్యకి.

ఉత్తరాలు బట్వాడా చేసేసమయంలో చేతిలో ఉత్తరాల కట్టతో వస్తున్న సీతయ్య అందరికీ అవుడు లాగా కనిపిస్తాడు. సీతయ్యని చూడగానే సంతోషంగా నవ్వుతూ పలకరిస్తారు అందరూ. సీతయ్య కూడా నవ్వుతూనే సమాధానం చెపుతాడు.

అందరి కళ్ళలో తనని చూడగానే కనపడే ఆత్రత, ఆశ, ఆనందం చూసి నవ్వుకుంటాడు సీతయ్య. పది ఆయ్యేసరికల్లా పోస్ట్‌మన్ సీతయ్య కోసం ఎదురు చూస్తుంటారు, ఆ రోడ్డులో ఉన్న వాళ్ళంతా, ఉత్తరం కోసం.

క్రమంగా ఉత్తరాలు ఇస్తూ వస్తున్న సీతయ్య గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తున్న ఆవిడని చూడగానే ఆశ్చర్యపోయాడు. తనకు గుర్తున్నంత వరకూ ఎప్పుడూ ఆవిడ తన కోసంగానీ, ఉత్తరం కోసంగానీ ఎదురుచూడలేదు.

"ఉత్తరం ముక్కేదయినా ఉందా, నాయనా?" అడిగింది ఆవిడ సీతయ్య దగ్గరికి రాగానే.

తల ఊపాడు సీతయ్య. కట్టలోంచి ఇన్‌లాండ్‌లెటర్ తీసి అందించాడు ఆవిడకి. కంగారుగా అందుకుని, చించి, సీతయ్య ఎదురుగానే హడావుడిగా ఆ ఉత్తరాన్ని చదివింది ఆవిడ.

ఉత్తరం చదవగానే ఆవిడ కంగారంతా మాయమయింది. మొహం విప్పారింది.

"ఉండు, నాయనా. వెళ్ళకు. ఇప్పుడే వస్తాను." ఆవిడ లోపలికి పరుగెత్తి, నిమిషంలో బయటికి తిరిగి వచ్చి సీతయ్య గుప్పెట్లో పోసింది – పంచదార.

"దేనికి?" అడిగాడు సీతయ్య నవ్వి.

"దేనికేమిటి? చల్లని వార్త తెచ్చావు. మా కోడలికి ప్రసవం చక్కగా అయింది. మగపిల్లవాడు. కానుపు కష్టమయినా ఇద్దరూ కులాసాగా ఉన్నారు — తల్లీ, కొడుకూ."

చిన్నగా నవ్వాడు సీతయ్య, తన సంతోషం వ్యక్తపరుస్తూ.

"ఇంత మంచి వార్త తెచ్చిన నీ నోరు తీపి చెయ్యాలి."

"నాదేముందండి? వచ్చిన ఉత్తరాలు ఇవ్వటమేగా నా పని? అంతా వాడి మాయ."

పైకి చూశాడు, ఆకాశం వైపు.

"ఇదే మొదటి కానుపు. నిండు నెలలు. టెలిగ్రామ్‌కూడా ఇవ్వలేదు. ఏమయిందో అని హడిలి ఛస్తున్నాను."

చెప్పుకుపోతూంది ఆవిడ.

గుప్పెట్లో పంచదార నోట్లో వేసుకోబోతున్న పోస్ట్‌మన్ సీతయ్య చేతులు ఆగిపోయాయి.

పెద్ద పెట్టున ఏడుపులు వినిపిస్తున్నాయి పక్క ఇంట్లోంచి. ఘొల్లున ఏడుస్తున్నారు అంతా.

"ఏమయింది?" అడిగింది ఆవిడ, అప్పుడే ఇంట్లోంచి బయటికి వచ్చిన పక్కింటి వాళ్ళబ్బాయిని.

"నాన్న చచ్చిపోయారు."

"టెలిగ్రామ్ వచ్చిందా?"

"లేదు. ఇప్పుడే ఉత్తరం ఇచ్చాడు పోస్ట్‌మన్. పెదనాన్నగారు రాశారు."

చిన్నగా చింపిన ఉత్తరంముక్కలు రోడ్డుమీద పారేశాడు. చావు ఉత్తరం ఇంట్లో ఉండకూడదు.

పోస్ట్‌మన్ సీతయ్య గుప్పెట్లో చక్కెర కిందికి జారిపోయింది.

చకచకా ముందుకి నడిచాడు. హృదయ విదారకంగా ఏడుస్తున్న వాళ్ళ ఏడుపులు తన గుండెను పట్టి నొక్కినట్లుగా బాధ పడుతున్నాడు పోస్ట్‌మన్ సీతయ్య. చచ్చిపోయిన అతను సీతయ్యకు బాగా తెలుసు. ఎన్నో ఉత్తరాలు స్వయంగా ఇచ్చాడు ఆయనకి, కేన్సర్‌తో హాస్పిటల్‌కి వెళ్ళబోయే ముందు.

నడుస్తూ ఆలోచిస్తున్నాడు సీతయ్య.

తన చేతిలో ఏం ఉంది? ఉత్తరాలు అందించడం కేవలం తన విధి— అవి సంతోషకరమైనవయినా, విచారకరమైనవయినా తనేం చేయలేడు.

అరచేతికి ఇంకా అంటి ఉన్న చక్కెరను దులుపుకున్నాడు సీతయ్య. క్రమంగా ఏడుపులకి దూరమయిపోయాడు.

పధ్నాలుగేళ్ళ పిల్లవాడు వీధిగుమ్మం మీద కూర్చుని నిరీక్షిస్తున్నాడు సీతయ్య కోసం. సీతయ్య అంత దూరంలో కనిపించగానే, రోడ్డుమీదికి ఒక్క ఉరుకు ఉరికి, సీతయ్య వైపు పరుగెత్తాడు.

"ఉత్తరా లున్నాయా మా నాన్నకి? కొత్త స్టాంపులు ఉన్నాయా ఏమయినా వాటిమీద?" అడిగాడు ఆత్రంగా.

నవ్వుతూ వాళ్ళ నాన్న ఉత్తరాలు అందించాడు సీతయ్య.

స్టాంప్స్ సేకరించే అలవాటు స్కూల్లో నేర్చుకున్నాడు బాబు. అందరూ ఉత్తరాల కోసం ఎదురు చూస్తుంటే, బాబు మాత్రం ఉత్తరాల మీద అతికించిన స్టాంపుల కోసం ఎదురు చూస్తుంటాడు.

మల్లాది వెంకటకృష్ణమూర్తి






బాబు నాన్న అడ్రసు కనపడగానే, ఆ ఉత్తరాలమీద కొత్త స్టాంప్స్ ఉన్నాయో లేవో చూస్తాడు సీతయ్య. లేకపోతే బాబు మొహం ఎలా పెడతాడో గుర్తుకు వస్తుంది. రేపయినా కొత్త స్టాంప్స్ వస్తే బాగుండును అనుకుంటాడు.

బాబు ఇంట్లోకి పరుగెత్తగానే, బాబు ఇంటి పక్కనే ఉన్న ఇంటితలుపు కింద నుంచి రెండు కార్డులు లోపలికి తోసి, ఉత్తరాలు వేసిన గుర్తుగా తలుపుమీద చేత్తో కొట్టాడు రెండు సార్లు. ఆ ఇంటి యజమానికి భార్యమీద తగని అనుమానం. అందుకని సీతయ్య ఉత్తరాలు స్వయంగా ఇవ్వడు. అలా తలుపు కింద నుంచి తోస్తాడు, ఆవిణ్ణి బయటికి పిలవటం ఇష్టంలేక.

ముందుకి నడిచాడు.

"ఎనీ మెయిల్?"

కాన్వెంట్‌లో చదువుతున్న పదిహేనేళ్ల అమ్మాయి అడిగింది సీతయ్యని, తియ్యని కంఠంతో.

యూనిఫారమ్‌లో, ముచ్చటగా ఉన్న ఆ అమ్మాయి అంటే సీతయ్యకు చాలా ఇష్టం. ఆ సందులో అందరికన్నా, ఆ అమ్మాయికి ఉత్తరం వచ్చిన రోజు తనకి ప్రమోషన్ వచ్చినట్లుగా సంతోష పడతాడు. పదిహేను రోజులకి ఒక సారి వస్తుంది ఆ అమ్మాయికి ఉత్తరం.

ఆ అమ్మాయి ఉత్తరం కోసం కట్టలో వెతకక్కరలేదు. అంచులకి రంగు బార్డర్ ఉన్న ఆ ఎయిర్‌మెయిల్ లెటర్‌కేరాసిన సెంట్ వాసన సీతయ్యకి బాగా పరిచితమే.

ఉత్తరం అందించాడు. వేళ్లతో సున్నితంగా ఆ ఎన్‌వలప్ అందుకుని లోపలికి పరుగెత్తింది ఆ అమ్మాయి.

వేల మైళ్ల దూరంలో ఉన్న ముక్కూ-మొహమూ తెలియని యూరపియన్‌తో కలంస్నేహం చేస్తుంది ఆ అమ్మాయి. ఉత్తరం చదువుతున్నంత సేపు, అతను దగ్గరుండి మాట్లాడినట్లుగా ఉంటుంది ఆ అమ్మాయికి.

ఎంత దూరంలో ఉన్నా, దగ్గర చేస్తాయి ఉత్తరాలు మనుషుల్ని, మనసులని. స్నేహానికిగాని, ప్రేమకిగాని, పరిచయానికిగాని, వ్యాపారానికి గాని, పిలుపుకుగాని— దేనికయినా ఉత్తరాలే ఆధారాలు, పునాదిరాళ్ళు.

ఏదో ఒక రోజు ఆ యూరపియన్‌ని పెళ్లిచేసుకుని రాజకుమారిలా వాళ్ల దేశం వెళ్లిపోతుందేమో ఈ అమ్మాయి. అనుకుంటాడు సీతయ్య అప్పుడప్పుడు.

ఆ కవరుమీద ఉన్న ఫారిన్ స్టాంప్స్ బాబుకి ఇస్తే ఎంత సంతోషపడతాడో?

ముందుకు కదిలాడు సీతయ్య అడుగులు చకచకా వేస్తూ.

రోజూ పాతికేళ్ల ఎనుడావిడ పోస్ట్‌మన్ సీతయ్య కోసం ఎదురు చూస్తుంటుంది. భర్త ఆఫీసుకి వెళ్లిపోగానే పిట్టగోడ దగ్గర కుర్చీ వేసుకుని కూర్చుని ఉంటుంది, వీధి వంక చూస్తూ. చాలా కథలు, వ్యాసాలు రాసి పంపింది ఆవిడ పత్రికలకి. అవి తిరిగి వస్తాయని, లేదా ప్రచురిస్తున్నామని తెలుపుతూ ఉత్తరం వస్తుందని ఆశ.

ఉత్తరం ఏమీ లేకపోతే లేదని చేయి ఊపుతాడు సీతయ్య క్రిందనుంచే. అలా చేయి ఊపడం మరిచిపోతే, మేడ మీదనుంచే అడుగుతుంది, ఉత్తరాలు ఏమయినా ఉన్నాయా అని.

అలా అడగడం, తనకి ఉత్తరం వచ్చి కూడా ఇవ్వకుండా వెళుతున్నాడని కాదు. అలా అడిగి ఉత్తరం లేదని నిర్ధారణ చేసుకుంటేగాని చాలా మందికి తృప్తి ఉండదు. లేకపోతే ఉత్తరం వచ్చికూడా

ఇవ్వడం మరిచిపోయాడేమోననే అనుమానం ఆ రోజంతా పీకుతుంది.

ఉత్తరం వచ్చింది ఆవిడకి. సీతయ్య మేడమీదికి చూశాడు. కాని ఉత్తరం తీసుకోవడానికి ఆవిడ లేదు అక్కడ. కవరుమీద ఫ్రమ్ అడ్రసు చూశాడు. ఓ పత్రిక ఆఫీసు అడ్రసు రబ్బర్ స్టాంప్ ఉంది కవరుమీద. కథ ప్రచురిస్తున్నామని తెలియపరుస్తూ రాసి ఉండవచ్చు వాళ్ళు.

మేడమెట్లు ఎక్కి పైకి వెళ్లాడు సీతయ్య. వాళ్ళు ఉండే పోర్షన్ తలుపు తాళం వేసి ఉంది. పక్క పోర్షన్‌లో వాళ్లని అడిగాడు, ఆవిడ గురించి.

"ఆవిడని హాస్పిటల్లో చేర్పించారు." చెప్పారు వాళ్ళు.

"ఏం?" అడిగాడు సీతయ్య.

"ఉదయమే నొప్పులు ప్రారంభం అయాయి."

ఆవిడ కడుపుతో ఉంది అనుకున్నాడు సీతయ్య.

"ఉత్తరం వస్తే ఇవ్వు. సాయంత్రం వాళ్లాయన రాగానే ఇచ్చేస్తాము."

ఉత్తరం ఇచ్చి క్రిందికి వచ్చేశాడు సీతయ్య. నడుస్తూ ఆలోచిస్తున్నాడు. బహుశా మగపిల్లవాడు పుట్టవచ్చు; లేదా కవలపిల్లలు. కథకూడా పడుతుంది. అదృష్టం.

పోస్ట్‌మన్ సీతయ్య ఉత్తరాలకట్టలో అప్పుడే సగందాకా ఉత్తరాలు తరిగిపోయాయి. అలా ఎవరి ఉత్తరాలు వాళ్లకి ఇచ్చుకుంటూ వెళుతూంటే, క్రమంగా చేతిలో ఉత్తరాలు తరిగిపోతూంటే, తృప్తిగా ఉంటుంది సీతయ్యకు. కట్టలో ఒక్కొక్క ఉత్తరం తగ్గిపోతున్న కొద్దీ, తన పని అయిపోతూందనే సంతోషం.

అన్ని ఉత్తరాలూ బట్వాడా అయిపోతే సంతోషంగా ఉంటుంది సీతయ్యకి. అడ్రసు తెలియకగాని, ఇల్లు తాళం పెట్టిఉండిగాని, లేదా ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోవటంగాని జరిగినా, ఉత్తరాలు వెనక్కి తీసుకు వెళ్లవలసివస్తే, చిన్నప్పుడు స్కూల్లో ఆటల్లో ఓడిపోయినప్పుడు ఎలా బాధపడేవాడో, అలా బాధపడతాడు సీతయ్య.

ఆ రోడ్డులో ఎక్కడా పత్రిక ఆఫీసు లేదు కనక సీతయ్య బతికిపోయాననుకుంటాడు. లేకపోతే, పత్రిక కార్యాలయానికి వచ్చే నవలలు, కథలు, ఉత్తరాలు, పత్రికవాళ్ళు పంపిన, చేరక తిరిగివచ్చే పత్రికలు మొదలయినవి చాలా ఉంటాయి, గంపెడు.

సీతయ్య ఓ ఇంటిముందు ఆగి, 'పోస్ట్' అని కేకేశాడు గట్టిగా. ముగ్గురు చిన్నపిల్లలు, ఎవరికి వారు తామే ఉత్తరం అందుకోవాలని పోటీపడి పరుగెత్తుకు వచ్చారు, ఒకరి నొకరు తోసుకుంటూ.

నా కివ్వు అంటే నా కివ్వు అని ఎగబడ్డారు, చేతులు చాచి.

చిన్నగా నవ్వి అన్నాడు సీతయ్య: "రెండే ఉత్తరాలు వచ్చాయి. అందరికన్నా చిన్నవాడి కిస్తాను."

ఒక ఇన్‌లాండ్ లెటర్, ఒక కార్డు అందించాడు ఆరేళ్ల పిల్లవాడికి.

ఉత్తరం అందుకుని రివ్వున లోపలికి పరుగెత్తాడు ఆ ఆరేళ్ల పిల్లాడు.

సీతయ్య బయటికి రాగానే ఒకతను బయట నిలబడి చూస్తున్నాడు. తన కోసమే అని గ్రహించాడు సీతయ్య వెంటనే. అతన్ని ఎప్పుడూ చూసినట్లుగా లేదు ఎక్కడా.

"ఏం కావాలి?" అడిగాడు సీతయ్య.

"మీరేకదా ఇక్కడ పోస్ట్‌మన్?" అడిగాడు అతను.

"అవును." చెప్పాడు సీతయ్య.

"నా పేరు అహోబలరావు. కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాను ఇక్కడికి, ప్రొద్దుటూరునుంచి. ఆ పచ్చమేడమీద అద్దెకి ఉంటున్నాను. నా కేమయినా ఉత్తరాలు వస్తే అక్కడ ఇవ్వండి."

"మీ కో ఉత్తరం ఉంది."

కట్ట అడుగున ఉన్న కార్డు ఒకటి తీసి ఇచ్చాడు సీతయ్య అహోబలరావుకి. అడ్రసు తెలియలేదు కాబట్టి అది కట్ట కిందికి తోసేశాడు.

ఎండ ఈ వేళ బాగా ఉంది అనుకుంటూ ముందుకు నడిచాడు సీతయ్య.

"సీతయ్యా, ఆగు."

పిలిచారు వెనకనుంచి ఎవరో.

సీతయ్య ఆగి వెనక్కి తిరిగి తనని పిలిచినాయన్ని చూసి, చిన్నగా నవ్వాడు పలకరింపుగా.

"ఉన్నాయా?" అడిగాడు ఆయన.

"లేవు" అన్నాడు సీతయ్య నవ్వి.

"ఏమిటోయ్, ఉత్తరం లేదంటావు? ఉత్తరం కోసం ఎదురుచూడటం అలవాటయి పోయిందోయ్ ఆ సమయానికి. ఉత్తరం వచ్చినా, రాకపోయినా ఉత్తరం వస్తుందా, రాదా అనే ఆదుర్దా సస్పెన్స్ ఉంటుందోయ్ నువ్వు కనపడే దాకా. ఆ సస్పెన్స్ సారా తాగినంత నిషా ఇస్తుంది, తెలుసా? నువ్వు ఎంత ఆలస్యంగా వస్తే అంత సేపు ఉంటుంది ఆ నిషా. నువ్వు కనపడి ఉత్తరం ఇవ్వగానే ఆ నిషా అంతా పోతుందోయ్."

చిన్నగా నవ్వాడు సీతయ్య, ఆ అరవై అయిదేళ్ళ ముసలాయన వంక చూసి.

"ఏం చేయనోయ్? అయిదుగురు కొడుకులు, నలుగురు కూతుళ్ళు. ఎవరి సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు. రోజూ ఎవరి దగ్గరినుంచో ఒకరి దగ్గరినుంచి ఉత్తరం వస్తుంది. అలా ఉత్తరాలు రావటంతో, ఎదురుచూడటం అలవాటయి, ఈ నిషా అలవాటయిందోయ్. సరే, వెళ్ళు. రేపు చూద్దాం."

సీతయ్య ముందుకి నడిచాడు మళ్లీ.

సీతయ్య కట్టలో ఉత్తరాలు మున్సిపాలిటీ పైపుగానే తరిగిపోయాయి. ఇంకో వంద గజాలు మాత్రమే ఉత్సాహంగా నడవ సాగాడు.

క్రగేటు తీసుకుని లోపలికి వెళ్లి, వరండాలో పేపరు చదువుతున్న ఆయన పక్కన, టేబిల్‌మీద పెట్టాడు ఉత్తరాలు. పేపరులోంచి మొహం తియ్యలేదు ఆయన. కళ్ళకూడా తిప్పి చూడలేదు.



త్రివేండ్రంలోని తెలుగు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మ 'భామా కలాపం' నృత్య కార్యక్రమం జరిగింది. కేరళ రాష్ట్ర గవర్నర్ శ్రీ విశ్వనాథన్ సతీ సమేతంగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షులు శ్రీ బి. రామకృష్ణరావు కళాకారులను పరిచయం చేశారు. ప్రభుత్వ న్యాయాధికారి శ్రీ అప్పుకుట్టన్ నాయర్ కూచిపూడి నృత్య విశేషాన్ని వివరించారు. ప్రసిద్ధ కథకళి కళాకారుడు గురు గోపీనాథ్ మెమెంటో బహూకరించారు. మూడు గంటలపాటు జరిగిన ఈ నృత్య కార్యక్రమం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది.

ఆ ముసలాయనని చూస్తే ఆశ్చర్యం వేస్తుంది సీతయ్యకి. రోజూ సీతయ్య వచ్చే సమయానికి పడక కుర్చీలో పడుకుని ఉంటాడు ఆయన పేపరు చదువుతూ. వారానికి నాలుగు రోజులయినా ఉత్తరం వస్తుంది ఆయనకి.

చాలామంది ఉత్తరాల కోసం ఆడా మగా, చిన్నా, పెద్దా భేదం లేకుండా పరుగెత్తుకు వచ్చి ఉత్తరం అందుకుని, ఎదురుగానే చించి చదువుతారు. కాని ఈయన అలా కాదు. ఉత్తరాలంటే ఉత్సాహం చూపించడు. సీతయ్యని ఉత్తరం ఉందా అని ఎప్పుడూ అడగడు. అసలు ఉత్తరం దగ్గరికి వచ్చి ఇచ్చేదాకా తీసుకోడు. పక్కనే ఉత్తరాలు పెట్టినా తల తిప్పయినా చూడడు, ఎక్కడినుంచి వచ్చాయి అవి చూడటానికి. కామ్‌గా పేపరు చదువుకుంటూనే ఉంటాడు. బహుశా పేపరు చదవడం అయ్యాక ఆ ఉత్తరం చదువుతాడు అనుకున్నాడు సీతయ్య. బయటికి వచ్చి క్రగేటు మూసేశాడు మళ్ళీ.

మరో రెండు చోట్ల ఇన్‌లాండ్ లెటర్స్, బుక్‌పోస్ట్ కవర్లు, కార్డులు ఇచ్చాడు సీతయ్య. పోస్ట్‌మన్ సీతయ్య అంత దూరంలో ఉండగానే, తమ్మిణ్ణి పంపించింది, పురుడుకి పుట్టింటికి తొలిసారిగా వచ్చిన అమ్మాయి. నవ్వుకుంటూ ఉత్తరం ఇచ్చాడు సీతయ్య, ఆమె తమ్ముడికి. తను వెళ్ళి ఉత్తరం ఇచ్చేదాకా, ఆలస్యం భరించలేదా? ఉత్తరం అందుకుని లోపలికి వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

బహుశా కొత్తగా భార్యని విడిచి ఉండవలసి వస్తోంది అతనికి. రోజుకో ఉత్తరం రాస్తున్నాడు భార్యకి అను కున్నాడు సీతయ్య, రోజూ ఆమెకి వచ్చే ఉత్తరాలు తలుచుకుని.

దాదాపు ఆ వీధి చివరకు వచ్చేశాడు సీతయ్య. వీధి చివర లాయర్‌గారింట్లో కూడా ఉత్తరాలు ఇచ్చేశాడు. ఇంక పైన ఇళ్ళు లేవు ఉత్తరాలు ఇచ్చేందుకు. రైలుకట్ట అడ్డం.

వీధి పక్కన ఉన్న చెట్టు నీడలో కూర్చున్నాడు సీతయ్య, చిన్నగా నిట్టూర్చి. బట్వాడా కాకుండా కట్టలో మిగిలిపోయిన ఉత్తరాలని చూసుకున్నాడు ఒకసారి. కుడిచేయి జేబులోకి పోనిచ్చి జేబురుమాలు బయటికి తీశాడు సీతయ్య. జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు గట్టిగా. చేతికి కవరు తగిలింది సీతయ్యకి, రుమాలు తిరిగి పెట్టేసేటప్పుడు.

జేబులోంచి బ్రౌన్ కలర్ కవరు తీశాడు బయటికి. గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్



తాతకోసం

కవరు అది. అందరి ఉత్తరాలు బట్వాడా చేశాక తన ఉత్తరం తీశాడు తిరిగ్గా. పోస్ట్‌మాస్టర్ స్వయంగా పిలిచి ఇచ్చిన ఉత్తరం అది.

కవరు చించి ఉత్తరం బయటికి తీసి, విప్పాడు. ఉత్తరం చదవగానే సీతయ్య మనసు పరవశించింది. పోస్టల్ అధికారులనుంచి వచ్చిన ఆర్డర్స్. రెండేళ్ళు కష్టపడి చదివి మెట్రిక్యులేషన్ పాసయిన దానికి ఫలితం! శ్రమ ఫలించింది. తను పెట్టుకున్న అప్లికేషన్ శాంక్షన్ అయింది.

పోస్ట్‌మన్‌నుంచి క్లర్క్‌గా ప్రమోట్ చేశారు తనని! అంటే, ఇంక రోడ్ల వెంబడి ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ తిరగక్కరలేదు తను, ఈ ఖాకీ డ్రెస్సులో. కుర్చీలో కూర్చుని, ఫాన్ కింద, కాగితాల మధ్య, దర్జాగా ఉద్యోగం చేయవచ్చు, హాయిగా. అప్పుడు జీతం కూడా ఎక్కువ వస్తుంది.

రోజూ అయితే విశ్రాంతి కోసం ఇంకాస్సేపు కూర్చునేవాడు పోస్ట్‌మన్ సీతయ్య. కాని ఇంక కూర్చోలేకపోయాడు అక్కడ, ఆ సంతోషంతో. వెంటనే లేచి చకచకా నడవసాగాడు, వచ్చినదారినే మళ్ళీ.

నడుస్తూనే క్లర్క్‌గా తన జీవితం, ఉద్యోగం ఊహించుకుంటున్నాడు సీతయ్య. బహుశా ఈ వేళే పోస్ట్‌మన్‌గా తనకి ఆఖరి రోజు. రేపటినుంచి తను పోస్ట్‌మన్ కాదు, క్లర్క్. ఈ రోడ్డు మీదికి మళ్ళీ పోస్ట్‌మన్‌గా రాడు. వచ్చినా కొత్త పోస్ట్‌మన్‌కి ట్రెయినింగ్ ఇచ్చేందుకు వస్తాడు. అంతే.

రెండు వైపులా చూశాడు, నడుస్తూ. ఇళ్ల తలుపులన్నీ మూసి ఉన్నాయి. ఎవరూ లేరు గుమ్మాలలో, ఎదురు చూస్తూ. మళ్ళీ రేపు ఉదయమే.

అవును. మళ్ళీ రేపు ఉదయం అంతా తన కోసం ఎదురుచూస్తారు. ఒక్క రేపు ఉదయమే కాదు, ప్రతి రోజు ఉదయం! తను పోస్ట్‌మన్‌గా బతికున్నాళ్ళు.

పన్నెండేళ్ళుగా ఇలా రోజూ ఉత్తరాలు బట్వాడా చేస్తూనే ఉన్నాడు తను. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ తిరుగుతూనే ఉన్నాడు. తన ఉద్యోగాన్ని, తన పనిని విసుక్కుంటూనే ఉన్నాడు. తనుకూడా ఒకచోట కదలకుండా కూర్చుని పని చెయ్యాలని కలలు కంటూనే ఉన్నాడు. కేవలం కలలతో పోనివ్వలేదు. తన కలలని నిజం చేసుకోవడానికి ప్రయత్నించాడు; సాధించాడు.

కాని, ఏమయింది తనకు? ఎందుకు? ఎందుకు తన ప్రయత్నం ఫలించినా సంతోషించలేకపోతున్నాడు ఇప్పుడు? ఏమయింది? ఏదో తెలియని ఆవేదన. విచారం. ఆరాటం. ఇంక తన కోసం రోజూ ఆశగా ఎదురుచూసేవాళ్ళు ఉండరు. తనని చూసి సంతోషంగా చేతులు చాపుతూ పరుగెత్తుకొచ్చే వాళ్ళు ఉండరు, ఉత్తరాల కోసం. తను గుమ్మం దగ్గిర నిలబడి 'పోస్ట్' అని కేకేయగానే పరుగెత్తుకుంటూ వచ్చే వాళ్ళు ఉండరు.

ఇక పోస్ట్‌మన్‌గా తనని ఇష్టంగా చూసేవాళ్ళు ఉండరు. ఎదురుచూసే వాళ్ళు ఉండరు. పోస్ట్‌మన్ అంటే అందరికీ ఇష్టం, తమకి ఉత్తరాలు తీసుకువస్తాడని. జీవితంలో కనీసం ఒక్కసారయినా ప్రతి మనిషి పోస్ట్‌మన్ కోసం ఆత్రతగా, ఆశగా ఎదురుచూసే సంఘటన ఉండకుండా ఉండదు.

ఇంక అంతా కొత్త జీవితం.

చేతిలోని కట్టలో మిగిలిపోయిన ఉత్తరాలవంక చూసుకొన్నాడు పోస్ట్‌మన్ సీతయ్య.

ఆశ్చర్యం! ఇన్నాళ్ళూ తను దేనికోసమని కలలు కన్నాడో, కష్టపడ్డాడో శ్రమపడ్డాడో, అది చేరువయ్యేసరికి ఇంత బాధ పడవలసి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

తన సొంత ఊరు వదిలి ఈ ఊరు వచ్చినప్పుడు ఇదే రకం గుబులు. తను ఆరేళ్ళు చదివిన స్కూలు వదిలినప్పుడు ఇదేవిధమయిన విచారం. తన తల్లి చచ్చిపోయినప్పుడు ఇలాంటి బాధే.

పోస్ట్‌మన్ తన పనిని విసుక్కుంటాడు, ఇంటింటికీ తిరగాలని. కాని అలవాటయిపోతుంది. క్రమంగా ఆ పనిలో ఒక విధమయిన ఆకర్షణ, తృప్తి కలుగుతాయి, తనకి తెలియకుండానే. తనంటే విలువ ఇస్తారని, తన కోసం గంటల తరబడి ఎదురుచూస్తారని, తనంటే ఎంతో ఇష్టపడతారని గ్రహించగానే సంతోషపడతాడు.

అకస్మాత్తుగా ఇక ఆ పని తనకి లేదని తెలియగానే. . .?

బాబు గుర్తుకు వచ్చాడు.

హాస్పిటల్లో ఉన్న ఆ రచయిత్రి గుర్తుకు వచ్చింది.

యూనిఫారంలో ఉన్న ఆ పదిహేనేళ్ల అమ్మాయి గుర్తుకు వచ్చింది.

ఇంకా చాలామంది గుర్తుకు వచ్చారు.

సందు మొదట్లో ఆగి జేబులోంచి రుమాలు తీసి మళ్ళీ మొహం తుడుచుకున్నాడు సీతయ్య.

రుమాలు జేబులో పెట్టుకుని తన ఆర్డర్ బయటికి తీశాడు. సందు మొదటే కొన్ని క్షణాలు నిలబడి ఆ సందులోకి చూశాడు సీతయ్య— తనకి బాగా పరిచితమయిన సందులోకి.

ఆ సందుకీ, తనకీ ఋణం తీరిందా? ఆర్డర్ తిరిగి జేబులో పెట్టుకోలేదు సీతయ్య. ఆలోచిస్తున్నాడు ఆ ఆర్డర్ చింపుదామా, వద్దా అని— పోస్ట్‌మన్ సీతయ్య.

★